సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



20 కిలోల గంజాయి స్వాధీనం

మదనపల్లెలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. - 8లో



పెట్రోల్ బంకుల తనిఖీ

కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం విజిలెన్స్ అధికారులు పెట్రోల్ బంకులలో ఆకస్మిక తనిఖీ చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.140	రూ.160
రెండోరకం	రూ.90	రూ.130



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 60 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	536	655
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 197.080 కిలోలు

ఆదర్శం.. ఆహ్వానం



- మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు
- ఈనెల 24 నుంచి దరఖాస్తుల స్వీకరణ



17 జిల్లాలో ఉన్న మోడల్ స్కూళ్లు

1700 6వ తరగతిలో సీట్లు





తంబళ్లపల్లెలోని మోడల్ స్కూల్

మదనపల్లె సిటీ : దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిరుపేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ విద్యను చేరువ చేయాలనే సంకల్పంతో ఏపీ మోడల్ పాఠశాలలను 2013లో ప్రారంభించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేడు మోడల్ పాఠశాలలు విప్లవాత్మక ఫలితాలు సాధిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో మాదిరిగా మోడల్ పాఠశాలల్లో ఇంగ్లిషు బోధనతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది.

దరఖాస్తుల ఆహ్వానం

మోడల్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 24వ తేదీ నుంచి మార్చి 31 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థి అర్హతను పరిశీలించి అర్హుడని తేలితే క్రెడిట్, డెబిట్ నెట్ బ్యాంకింగ్ కార్డులు ఉపయోగించి గేట్‌వే ద్వారా రుసుం చెల్లించిన తరువాత ఒక జర్నల్ నంబర్ కేటాయిస్తారు. ఆ నంబర్ ఆధారంగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్.ఏపీఎంఎస్.ఏపీ జీవోవీ.ఇన్ ఆన్‌లైన్‌లో ప్రవేశించి దరఖాస్తు చేసుకోవచ్చు. తరువాత నఖలును పాఠశాలల్లో సమర్పించాల్సి ఉంటుంది .

సౌకర్యాల చెంతన...

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివించేందుకు ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థులకు మోడల్ పాఠశాలలు వరంగా మారాయి. జిల్లాలో 17 మోడల్ పాఠశాలలున్నాయి. ఇందులో 1700 సీట్లు ఉన్నాయి. బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలల వద్దనే వసతిగృహాలు నిర్మించారు. విద్యార్థులకు విద్యాభ్యాసంపై మరింత శ్రద్ధపెంచుకునే అవకాశం కలిగింది. ప్రతిభావంతులైన పిల్లలకు పూర్తి స్థాయిలో ఇంగ్లిషు మీడియం విద్యను అందిస్తున్న మోడల్ పాఠశాలలోల ప్రవేశం పిల్లల భవితకు చక్కని అవకాశంగా మారిందని తల్లిదండ్రులు భావిస్తున్నారు.

ఎవరు అర్హులు..

ఓసీ,బీసీ విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1,2015 ఆగస్టు 31వతేదీ మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ సెప్టెంబర్ 1,2011 నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ లోపు జన్మించి ఉండాలి. ఎస్సీ,ఎస్టీల విద్యార్థులు రూ.75, ఓసీ,బీసీలు రూ.150 చెల్లించాలి. ప్రభుత్వం లేక ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా ఐదో తరగతి చదివి ఉండాలి.

ఎంపిక విధానం ఇలా...

మోడల్ పాఠశాలల్లో ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నారు. ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఓసీ,బీసీ విద్యార్థులు కనీసం 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు రావాలి. ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఎంపిక విషయంలో హెచ్ఎంలకు ఎలాంటి అధికారాలు ఉండవు. జిల్లా డిఈవో పర్యవేక్షణలో ఎంపిక జరుగుతుంది.

నాణ్యమైన బోధన



పేద విద్యార్థులకు మోడల్ పాఠశాలలు బంగారు భవిష్యత్తు ఇస్తాయి. ఐదో తరగతి పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మోడల్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. నాణ్యమైన విద్యాబోధనతో పాటు పాఠపుస్తకాలు యూనిఫాం ఉచితంగా ఇస్తారు .బాలికలలకు వసతిగృహం అందుబాటులో ఉంది. – సుబ్రమణ్యం, డిఈఓ

ప్రత్యేకతలు

- 6 నుంచి ఇంటర్ వరకు ఒకే చోట చదివే అవకాశం
- అత్యాధునిక తరగతి గదులతో ఇంగ్లిషు మీడియంలో బోధన
- క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యా బోధన
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు ఉచిత వసతిగృహ సదుపాయం.
- ఉన్నత విద్యార్హతలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే బోధన
- పోటీ పరీక్షలకు విద్యార్థులను ఆరో తరగతి నుంచే సన్నద్ధం చేయడం.
- శారీరక, మానసిక దృఢత్వం కోసం విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం.

న్యూస్‌రీల్

నూతన కమిటీ నియామకం

సిద్దవటం : శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి మూడురోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు దేవదాయశాఖ అధికారులు శనివారం ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా 10 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా వంతాటిపల్లె గ్రామానికి చెందిన జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, సభ్యులుగా గంగాదేవి, చెన్నమ్మ, రమణయ్య, బాలసుబ్రమణ్యం, లక్షుమ్మ, నరసింహారెడ్డి, పుల్లమ్మ, ఎరికలయ్య, మునీంద్ర, శేషాద్రిశర్మ నియమితులయ్యారు.

స్కౌట్స్ శిక్షణతో క్రమశిక్షణ, సేవాభావం..



బాడెన్-పావెల్ చిత్రపటానికి నివాళు అర్పిస్తున్న డీఈఓ సుబ్రమణ్యం

సంబేపల్లె : స్కౌట్స్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. శనివారం స్కౌట్స్ పితామహుడు బాడెన్-పావెల్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వరల్డ్ థింకింగ్ డే కార్యక్రమంలో డీఈఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ దేశంలో ప్రజలు మంచి ఆలోచనలతో మెలుగుతారో ఆ దేశ భవిష్యత్తు బంగారుమయంగా మారుతుందన్నారు.మన ప్రపంచం- మనభవిష్యత్తు అనే నినాదంతో ఈ వరల్డ్ థింకింగ్ డే జరుపుకుంటారన్నారు.అనంతరం బాడెన్-పావెల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్‌లో ప్రతిభ



ప్లేయర్ ఆఫ్ ది టోర్నీని అందుకున్న శివకోటి

నందలూరు : అంతర్జాతీయ దివ్యాంగుల క్రికెట్‌లో భాగంగా నేపాల్‌తో జరిగిన టీ–20 క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు తరపున నందలూరుకు చెందిన అలుసూరు శివకోటి పాల్గొన్నారు. మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. శనివారం శివకోటి మాట్లాడుతూ మూడు టీ-20ల్లో 72 పరుగులు చేసి, 11 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ఎంపికైనట్లు చెప్పారు. ఫిబ్రవరి 14 నుంచి 20వ తేదీ వరకు బోర్డ్ ఆఫ్ డిసేబుల్డ్ క్రికెట్ ఇండియా వారి ఆధ్వర్యంలో నేపాల్‌లో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయన్నారు. చివరి మ్యాచ్‌లో కెప్టెన్‌గా అవకాశం వచ్చిందని తెలిపారు. తనకు శిక్షణ ఇచ్చి మెలకవలు నేర్పిన క్రికెట్ కోచ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాములోరి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేయాలి

– టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం



ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు జేఈఓ వి వీరబ్రహ్మం సూచించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 6 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఏప్రిల్ 11న జరగనున్న సీతారాముల కల్యాణానికి ముందస్తుగా అనుమతులు తీసుకుని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. శ్రీ సీతారాముల కళ్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో కడప జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని టీటీడీ ఈఓ జె శ్యామలరావు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేవలం 45 రోజులు గడువు ఉన్న నేపథ్యంలో ముందస్తుగా చెక్ లిస్టు పెట్టుకొని, అందుకు అనుగుణంగా మార్చి నెల చివరి నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో సీఈ సత్యనారాయణ, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, ఒంటిమిట్ట ప్రత్యేక అధికారి ప్రశాంతి, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, అన్న ప్రసాద ప్రత్యేకాధికారి జీఎల్ఎన్ శాస్త్రి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

సంబేపల్లె : సంబేపల్లె పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ప్రజలకు పోలీసులు అందిస్తున్న సేవల గురించి ఆరాతీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

తొలి స్వాతంత్య్ర యోధుడు ఉయ్యాలవాడ

– వర్ధంతి సభలో ఎమ్మెల్యే ఆకేపాటి

కడప సెవెన్‌రోడ్స్ : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రథమ స్వాతంత్య్ర యోధుడని, ఆయన తిరుగుబాటు జాతీయోద్యమానికి ఎంతో ప్రేరణ ఇచ్చిందని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఉయ్యాలవాడ 178వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈస్ట్ ఇండియా కంపెనీ దోపిడీ, ఆధిపత్యాలను ఎదిరించిన సాహసి అని కొనియాడారు. తిరుగుబాటును కర్కశంగా అణిచివేసిన బ్రిటీషర్లు నరసింహారెడ్డి కోయిలకుంట్లలో బహిరంగంగా ఉరి తీసి ప్రజలను భయభ్రాంతులను చేసేందుకు 30 ఏళ్లు ఆయన తలను అలాగే ఉంచారన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం ఆయన చేసిన పోరాటం, త్యాగం మరువలేనిదని, రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు.కడపలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. అధ్యక్షత వహించిన మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.హరీంద్రనాథ్ మాట్లాడుతూ నేటి తరానికి స్ఫూర్తినిచ్చేందుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి చరిత్రలను పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నంద్యాలకు చెందిన సీనియర్ జర్నలిస్టు కాశీపురం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నరసింహారెడ్డిని ప్రథమ స్వాతంత్య్ర యోధునిగా గుర్తించాలన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వారసుడు కర్నాటి మహేంద్రనాథ్‌రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి : జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఆర్ఐఓ కృష్ణయ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు 49 పరీక్షా కేంద్రాల్లో జరిగే పరీక్షలకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప అన్ని ఏర్పాట్లు ముందస్తుగానే పూర్తి చేయాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులందరూ అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మొదటి సంవత్సరం 14855 మంది, రెండో సంవత్సరం 137474 మంది, మొత్తం 28602 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని చెప్పారు. వీరితో పాటు 2156 మంది ఒకేషనల్ విద్యార్థులు కూడా పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించి 49 మంది చీఫ్ సూపరింటిండెంట్లను, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చూడాల న్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు అన్ని రూట్లలో సకాలంలో బస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎం.వెంకటాద్రి, డీఆర్ఓ మధుసూదన్‌రావు, డీఈఓ సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు ఎం.ప్రకాష్, ఎన్.అమరేంద్రకుమార్, ఓ.నాగసురేష్, విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య, ఆర్టీసీ, తపాలా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదవారికి ఇంటిస్థలం పట్టా అందాలి

అర్హత కల్గిన పేదలకు ఇంటిస్థలం పట్టా అందాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వీఆర్ఓలకు ఇళ్ల పట్టాల రీ వెరిఫికేషన్, అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జీఓ 30 ద్వారా అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ అనే అంశంపై రాయచోటి ఇన్‌చార్జ్ తహసీల్దార్ నరసింహ కుమార్ అన్ని మండలాల తహసీల్దార్లకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఏడీ సర్వే భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకేపాటిపై అక్కసు

- అందరికీ అందుబాటులో ఉంటూ... సౌమ్యుడిగా గుర్తింపు
- సార్వత్రిక ఎన్నికల్లో పట్టు నిరూపించుకున్న ఎమ్మెల్యే
- కక్షసాధింపు చర్యల్లో భాగంగా కుటుంబంపై విష ప్రచారం
- వైఎస్సార్ సీపీ నాయకుల మూలాలు దెబ్బతీసేలా వ్యూహం



సాక్షి రాయచోటి : అందరికీ సుపరిచితుడు...మృధుస్వభావిగా పేరెన్నికగన్న ఆయన ఒక నియోజకవర్గానికి ఎమ్మెల్యే...పిలిస్తే పలకడమే కాదు.. మంచి వ్యక్తిత్వం ఆయన సొంతం...ప్రతి యేటా వెంకటేశ్వర స్వామిపై భక్తితో అన్నమయ్య కాలిబాట రహదారిలో తిరుమలకు వెళుతూ ఆధ్యాత్మిక వేత్తగా అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. అందుకే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభావం కనిపించినా రాజంపేట నియోజకవర్గంలో మాత్రం ఆకేపాటి అమర్‌నాథరెడ్డే కావాలంటూ ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారంటే ఆయనకున్న పట్టు ఏపాటిదో ఇట్టే అర్థమవుతుంది. అంతవరకు బాగానే ఉన్నా...ఇక్కడ అసూయలు, కుట్రలు, కుతంత్రాలు పురుడు పోసుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాప్రతినిధిగా నేరుగా ఎదుర్కొనలేక తెరవెనుక కుట్రలు, కుతంత్రాలకు తెర తీశారు. ఈ కోవలోనే ఆకేపాటిని మానసికంగా దెబ్బతీయాలన్న లక్ష్యంతో ఆక్రమణల పేరుతో విష ప్రచారం ఒడిగట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే వైఎస్సార్ సీపీలోని కీలక నేతల ఆర్థిక మూలాలను దెబ్బతీసి వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేసే అంశం ప్రజాస్వామ్యంలో ఆందోళన కలిగించే పరిణామం.

జిల్లా అధ్యక్షుడి కుటుంబంపై కుట్రలు

వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డితోపాటు ఆయన కుటుంబంపై కుట్రలు కొనసాగుతున్నాయి. వైఎస్ కుటుంబానికి విధేయుడిగా ఉంటూ మంచి మనిషిగా గుర్తింపు పొందిన ఆకేపాటిని పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. అప్పటి నుంచి వైఎస్సార్ సీపీని అన్ని విధాలుగా బలోపేతం దిశగా తీసుకెళుతూ కార్యకర్తలు, నాయకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆకేపాటిని అభాసుపాలు చేయాలన్న దురుద్దేశంతో అధికారుల ద్వారా దెబ్బతీసే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఆయన ఇంటిని అక్రమంగా నిర్మించుకున్నారని, అక్రమంగా భూములు సాగు చేస్తున్నారని ఆరోపిస్తూ విష ప్రచారానికి తెర తీశారు. అయితే కుట్రలను ఆకేపాటి దీటుగా ఎదుర్కొంటున్నారు. ఎప్పుడూ కూడా అవినీతి అక్రమాలకు దూరంగా ఉంటున్నామని, నిజాయితీ నిబద్ధతతో ముందుకెళుతున్నట్లు ఇప్పటికే ఆయన స్పష్టం చేశారు. రాజంపేట నియోజకవర్గంలో ఆకేపాటి ఆక్రమణలకు తెర తీశారంటూ ఎవరూ కూడా నమ్మేపరిస్థితి లేదని నియోజకవర్గ వాసులు భావిస్తున్నారు.

ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టే వ్యూహం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే వైఎస్సార్ సీపీ కీలక నేతలపై కక్ష కట్టారు. ప్రధానంగా పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేతల ఆర్థిక మూలాలతోపాటు ఆస్తులను దెబ్బతీసేలా కూటమి నేతలు వ్యూహ్యం అమలు చేస్తున్నారు. అయితే నేతలు తెరవెనుక ఉంటూ అధికారుల ద్వారా పథకం రచించి అమలు చేస్తున్నారు. ఈ కోవలోనే ఉమ్మడి వైఎస్సార్ జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డికి సంబంధించిన భూముల విషయంలోనూ అధికారుల ద్వారా సర్వే పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కలకడ ఎంపీపీ ఇంటిపై కూడా దాడులు నిర్వహించడం, మాజీ ఎంపీపీ రెడ్డెయ్య ఇంటిపై దాడుల ఘటనలు కూడా ఆందోళన కలిగించే పరిణామం.

ఇవేకాకుండా ఇటీవల రామాపురం, రాయచోటి, రాజంపేట ఇలా పలు మండలాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు సంబంధించిన స్థలాలు, ఇళ్లను ఆక్రమణల పేరుతో కూల్చి వేస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం. ప్రజాస్వామ్యంలో ఈ తరహా ఘటనలపై ప్రజాస్వామ్యవాదులు పెదవి విరుస్తున్నారు.

నేటి నుంచి వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు







ప్రత్యేక అలంకరణలో శ్రీ వీరభద్రస్వామి, శ్రీ భద్రకాళీ అమ్మవారు, స్వామి వారి పశ్చిమ ద్వారం ముస్తాబు చేస్తున్న ఆలయ సిబ్బంది, కార్మికులు

రాయచోటి టౌన్ : దక్షిణకాశిగా పేరు గాంచిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 5 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మాఢవీధులను శుభ్రం చేసి ఉంచారు. భక్తులకు విడిది కోసం సమీపంలోని ఉర్దూ మీడియం పాఠశాల, ప్రైవేట్ పాఠశాల భవనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వాహనలను నిలిపేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, పాత రాయచోటి సమీపంలోని ఓ ప్రైవేట్ మైదానంలో ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమలు కానున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గాలివీడు సర్కిల్, బ్రాహ్మణ వీధి గుండా ఆలయానికి చేరుకునేలా కాలినడక వచ్చే వారికి మాత్రం ఠానా సర్కిల్ నుంచి గాంధీబజార్ ద్వారా వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు.

స్వామి వారిని దర్శించుకొనేందుకు భక్తులకు ఇబ్బంది కలగకుండా దక్షిణ భాగంలోనుంచి లోపలికి వచ్చే విధంగా క్యూలైన్ ఏర్పాటుచేశారు. ఉత్సవాల సమయంలో క్యూలైన్‌లో వచ్చే వారికి అన్నప్రసాదాలు, తాగునీరు అందించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- 23.2.25: ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం, రాత్రి శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయం నుంచి మృత్తికా సంగ్రహణంతో అంకురార్పణ, త్రిశూల మెరవణి, అగ్నిప్రతిష్ఠాపన జరుతాయి.
- 24.2.25: ఉదయం స్వామి వారి కల్యాణోత్సవం. స్వామి, అమ్మవార్లకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దంతలుతో పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాల అందజేత రాత్రి స్వామివారి మయూర వాహనంపై గ్రామోత్సవం ఉంటుంది.
- 25.2.25: నవగ్రహ హోమం, యాళివాహనోత్సవం, రాత్రి సింహవాహనసేవ.
- 26.2.28 ఉదయం రుద్రహోమం, మహాశివరాత్రి అభిషేకాలు, గజవాహనోత్సవం, రాత్రి పురుష మృగ వాహనోత్సవం (చదురు) నిర్వహిస్తారు.
- 27.2.25: ఉదయం క్షేత్రపాలక హోమం, పులి వాహనోత్సవం, రాత్రి రావణ మహోత్సవం (చదురు) నిర్వహిస్తారు.
- 28.2.25: ఉదయం 9 గంటలకు పరివార దేవతా హోమం, (చండీహోమం, శేషవాహనోత్సవం, రాత్రి పుష్పోత్సవం, చంద్రప్రభ వాహనోత్సవం (చదురు) నిర్వహిస్తారు.
- 1.3.25: ప్రమద గణ హోమం, సూర్యప్రభ వాహనోత్సవం, రాత్రి నందివాహనోత్సవం నిర్వహిస్తారు.
- 2.3.25: తెల్లవారు జామున 4.30 గంటలకు వేదపండితుల ఆధ్వర్యంలో అగ్నిగుండ ప్రవేశం, రుద్రహోమం, తరువాత మహానైవేద్య ఘట్టం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి రథోత్సవం జరగుతుంది.
- 3.2.25: మహాపూర్ణాహుతి, కంకణ విసర్జన, ధ్వజావరోణం, వసంతోత్సవం, రాత్రి హంసవాహనోత్సవం జరుగుతాయి.
- 4.2.25: ఉదయం మహా సర్వతి పూజ,పిల్లలకు అక్షభ్యాసాలు చేస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి స్వామి వారి పార్వేట రవిధియేటర్ సమీపంలోని నాలుగు కాళ్ల మండపం వద్ద నిర్వహిస్తారు.
- 5.3.25: డోలోత్సవం, ఏకాంత సేవ, శయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లాలోని అన్ని డివిజన్ ఆఫీసుల పరిధిలో ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్‌శాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. విద్యుత్ సంస్థకు సంబంధించిన అన్ని కలెక్షన్స్ సెంటర్స్‌లో బిల్లులు, బకాయిలు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- గృహ విద్యుత్ వినియోగదారులు వినియోగిస్తున్న అదనపు లోడ్లను క్రమబద్ధీకరించుకుంటే వారు డెవలప్‌మెంట్‌చార్జీలు ఒక్కసారిగా చెల్లిస్తే చెల్లించాల్సిన మొత్తంలో 50 శాతం రాయితీగా పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని 01.03.2025 నుంచి 30.06.2025 వరకు ఉంటుందన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

పీలేరు : స్థానిక రౌద్రాల అంకాలమ్మ ఆలయం వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే అతని ఎవరైంది తెలియరాలేదు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

గుజిరీలో అగ్నిప్రమాదం



పీలేరు రూరల్ : ప్రమాదవశాత్తు ఓ గుజిరీలో అగ్నిప్రమాదం జరిగింది. పీలేరు పట్టణానికి చెందిన ఎస్. ఖాదర్‌వలి రాజీవ్‌నగర్ కాలనీ కొత్తపల్లె రోడ్డులో గుజిరీ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. శనివారం గుజిరీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించారు. అయితే ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న గుజిరీకి మంటలు వ్యాపించి కాలిపోయింది. సుమారు రూ.15 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

విద్యార్థి అదృశ్యం



శివశంకర (ఫైల్)

కలకడ : తల్లిదండ్రులు మందలించారని విద్యార్థి అదృశ్యమైన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం కదిరాయచెర్వు గ్రామానికి చెందిన గౌరవం శివశంకర కుమారుడు గౌరవం వెంకటేశ్వర తిరుపతి ఎస్.జి.ఎస్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో బి.కాం తృతీయ సంవత్సరం విద్య పరీక్షలు రాసి ఇంటికి చేరుకున్నాడు. 16వతేదీ ఆదివారం అతని పుట్టిన రోజును మిత్రులతో కలిసి ఘనంగా జరుపుకున్నాడు. మిత్రులతో అతిగా తిరగవద్దని ఇంట్లో ఉండి చదువుకోవాలని తల్లి దండ్రులు మందలించడంతో 18వతేదీ మంగళవారం ఇంటివద్ద పెద్దలు లేని సమయంలో ఇంటినుంచి పరారయ్యాడు. నాలుగు రోజులుగా చుట్టు పక్కల గ్రామాలు, తిరుపతి కళాశాల వద్ద విచారించినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో శనివారం విద్యార్థి తండ్రి కలకడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసినవారు కలకడ ఎస్‌ఐ నంబర్: 9440900713 లేదా విద్యార్థి తండ్రి శివశంకర నంబర్: 9959474550 కు కాని సమాచారం అందించాలని కోరారు.

టూ ట్వంటీ భూ వివాదం కొత్త మలుపు.!



అంగళ్లులోని 220 వద్ద హైవేపై ధర్నా చేస్తున్న ప్లాట్లు కొన్న బాధితులు



ఆగ్రహంతో 220లో ఫెన్సింగ్‌ను ధ్వంసం చేస్తున్న బాధితులు

- ప్లాట్ల కొనుగోలుదారులు హైవేపై రాస్తారోకో
- అక్రమ ఫెన్సింగ్ ధ్వంసం
- అంగళ్లులో ఉద్రిక్తత

కురబలకోట : కురబలకోట మండలం అంగళ్లులో కదిరి రోడ్డులోని సర్వే నంబర్ 220 (టూ ట్వంటీ) భూ వివాదం శనివారం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. ఐదన్నర ఎకరం ఉన్న ఈ భూమిలో ఇదివరలో ప్లాట్లు వేయగా వివిధ ప్రాంతాలకు చెందిన 72 మంది కొనుగోలు చేశారు. ఇందులో నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఉన్నట్టుండి బయటి వ్యక్తులు ఈ భూమి తమదేనంటూ మంది మార్బలంతో వచ్చి చుట్టూ సిమెంట్ పలకలతో ఫెన్సింగ్ వేసి వెళ్లిపోయారు. దీంతో ప్లాట్లు కొన్నవారు ఖంగుతిన్నారు. వీరంతా శనివారం అంగళ్లు చేరుకుని అక్రమంగా బయట వ్యక్తులు చేసిన ఫెన్సింగ్‌ను ఒక్కసారిగా ధ్వంసం చేశారు. అంతకు ముందు అక్కడి హైవేపై ప్లాట్లు కొనుగోలు చేసిన వారు న్యాయం చేయాలని రాస్తారోకో చేశారు. అనంతరం పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. తర్వాత అక్రమ ఫెన్సింగ్‌ను తొలగించి ప్లాట్లలోకి వెళ్లారు. ఇక్కడి భూమిలో మాటిమాటికి ఎవరెవరో సంబంధం లేని వారు వచ్చి భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ప్లాట్ల నిర్వాహకుడు రాజు తెలిపారు. ఈ భూమిపై తమకు సర్వ హక్కులు ఉన్నాయని తెలిపారు. రికార్డులు పరిశీలించుకోవచ్చన్నారు. తమకు తప్ప ఎవరికన్నా భూ రికార్డులు ఉంటే సదరు భూమిని వదిలేస్తానని తెలిపారు. తుమ్మచెట్లపల్లెకు చెందిన చల్లా మోహన్, పులివెందులకు చెందిన సతీష్ ఈ భూమిపై కన్నేసి కబ్జాకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇక నుంచి భూ కబ్జాదారుల బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఏది ఏమైనా అంగళ్లు హైవే పక్కన ఉన్న టూ ట్వంటీ భూమి వివాదాలమయంగా మారింది. అంగళ్లులో భూముల రేట్లు భగ్గుమంటున్నాయి. దీంతో ఒకరు పోతే మరొకరు రావడం భూమిని కబ్జా చేయడం పరిపాటిగా మారింది. దీంతో స్థానికంగా తరచూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇది సివిల్ వ్యవహారం కావడంతో అధికార యంత్రాంగం కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది. ఒక్కోసారి శాంతి భద్రతల సమస్యగా కూడా మారుతోంది. అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా భూ బాధితులు కోరుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన



బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

బి.కొత్తకోట : ఏడాదిగా సబ్ కలెక్టర్, కలెక్టర్, గతంలో పనిచేసిన నలుగురు తహసీల్దార్లకు సమస్య చెప్పుకుని రోదించాం.. కాళ్లు పట్టుకున్నాం.. కనికరించలేదు. చివరకు మేము చస్తే గాని సమస్య తీరదంటూ అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం గండువారిపల్లికి చెందిన రైతులు శనివారం తహసీల్దార్ ఎదుటే ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించారు. గండువారిపల్లికి చెందిన రైతుల భూములకు వన్ బీ రావడం లేదు. వేర్వేరు భూములన్నింటినీ కలిపి జాయింట్‌గా నమోదు చేశారు. మ్యూటేషన్లు కావడం లేదు. దీనిపై గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. తమ సమస్యకు పరిష్కారం చూపాలని, తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్ రైతుల వద్దకు వచ్చి సమస్య తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అయినప్పటికీ విసిగిపోయిన రైతులు పురుగుల మందు, ఉరితాడుతో ఇద్దరు రైతులు, పెట్రోల్ పోసుకొని మరో రైతు ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న తోటి రైతులు వీరిని అడ్డుకున్నారు. ఈ ఘటనతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

గుమ్మసముద్రం గ్రామం రీసర్వేలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. గుండువారిపల్లిలో ఏ ఒక్క రైతుకు 1-బి రావడం లేదని రైతులు తెలిపారు. గ్రామస్తులు ఆలయాల నిర్వహణ కోసం వినియోగించుకుంటున్న ప్రభుత్వ భూమిని సచివాలయ సర్వేయర్ ఒకరు తన తల్లి పేరు మీద ఆన్‌లైన్ చేసుకున్నాడని ఆరోపించారు.

అవకతవకలకు పాల్పడిన వీఆర్‌ఓ, సచివాలయం సర్వేయర్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్ రైతులతో మాట్లాడుతూ సోమవారం నుంచి మీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాననే హామీతో రైతులు ఆందోళన విరమించారు. వీరికి సీపీఐ నాయకులు మద్దతు ప్రకటించారు.

మాయ మాటలు చెప్పి రూ.20 వేలతో ఉడాయించాడు



బాధితురాలు గుల్జార్ బేగం

పీలేరు రూరల్ : హౌసింగ్‌లో ఇల్లు మంజూరు చేయించామని మాయమాటలు చెప్పి రూ. 20 వేలు తీసుకెళ్లిన సంఘటన పీలేరు పట్టణం తిలక్‌వీధిలో చోటు చేసుకుంది. స్థానిక తిలక్ వీధికి చెందిన గుల్జార్‌బేగం ఒంటరిగా జీవనం సాగిస్తోంది. శుక్రవారం ఓ వ్యక్తి మాస్క్ ధరించి ఆమె ఇంటి వద్దకు వెళ్లి మీకు కాలనీ ఇల్లు వచ్చిందని చెప్పాడు. మీ కుమారుడితో కూడా మాట్లాడానని, మొత్తం రూ. 30 వేలు చెల్లించాల్సి ఉండగా, మీ కుమారుడు రూ. 10 వేలు ఇచ్చాడని నమ్మబలికాడు. మిగిలిన రూ. 20 వేలు నీ దగ్గర తీసుకోమని చెప్పాడని చెప్పడంతో ఆమె నిజమేనని నమ్మి రూ. 20 వేలు ఆ వ్యక్తికి ఇచ్చింది. ఈ విషయం మీ కుమారుడికి చెబుతానని ఆమె వద్ద నుంచి ఫోన్ తీసుకుని.. పని చేయలేదని చెప్పి ఆ ఫోన్ సిమ్‌కార్డు తీసి తిప్పించి వేసి ఆమెకు ఇచ్చి వెళ్లిపోయాడు. అనంతరం ఆమె కుమారుడు తిరుపతి నుంచి ఇంటికి రాగా మోసపోయిన విషయం బయట పడింది. బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

లాటరీ విక్రేత అరెస్టు

మదనపల్లె : అక్రమంగా లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఏరిసావలీ తెలిపారు. పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన గౌస్‌పీరా (55) బెంగళూరు బస్టాండు సమీపంలో నిషేధిత లాటరీ టిక్కెట్లను విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 111 లాటరీ టిక్కెట్లతో పాటు రూ.1400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

నయా ట్రెండ్ సృష్టించాలి

అంగళ్లులో సందడి చేసిన డీజే టిల్లు భామ నేహా శెట్టి



నేహా శెట్టికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

కురబలకోట : డీజె టిల్లు ఫేమ్ భామ నేహా శెట్టి శనివారం రాత్రి అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సందడి చేశారు. కళాశాలలో ప్రతిష్టాత్మకంగా జరిగిన అశ్వ-25 ఫెస్టివల్‌లో తళుకుబెళుకుల భామ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కైపెక్కించే చూపులతో కుర్రకారును ఉర్రూతలూగించారు. హాయ్..బాగున్నారా..హలో మిట్స్..అంటూ అందరిని కత్తిలాంటి చూపులతో పదునైన మాటలతో ఆకట్టుకున్నారు. ఆమె అందచందాలు విద్యార్థులను షేక్ చేశాయి. ఈమెను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవడానికి ఎగబడ్డారు. ఆమె మాట్లాడుతూ టెక్నాలజీ పెరిగిన ఈ రోజుల్లో విద్యార్థులు న్యూ ట్రెండ్ సృష్టించాలన్నారు. రోల్ మోడల్‌గా నిలవాలన్నారు. చదువుల్లో రాణిస్తే లైఫ్ ఎంజాయ్ చేయవచ్చన్నారు. సమయాన్ని వృథా చేయకుండా చదువు సంధ్యల్లో రాణిస్తూ ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలన్నారు. ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం

- మదనపల్లెలో నిందితులను అరెస్టు చేసిన హుబ్లీ పోలీసులు
- బాధితుడి అకౌంట్ నుంచి రూ. 15 లక్షలు మాయం



టూ టౌన్ పోలీసు స్టేషన్ వద్ద హుబ్లీ పోలీసులు

మదనపల్లె : ఆన్‌లైన్ మోసానికి సంబంధించిన కేసులో, మదనపల్లె నీరుగట్టువారిపల్లెకు చెందిన ముగ్గురు నిందితులను కర్ణాటక రాష్ట్రం హుబ్లీ పోలీసులు శనివారం అరెస్టు చేసి కర్ణాటకకు తరలించారు. సౌదీలో ఉంటున్న ఓ వ్యక్తి మదనపల్లె నీరుగట్టువారి పల్లెకు చెందిన ముగ్గురు వ్యక్తులతో ఆన్‌లైన్ పరిచయం పెంచుకున్నాడు. వారి సహాయంతో షేర్ మార్కెట్‌కు సంబంధించిన నకిలీ యాప్ సృష్టించాడు. ఈ యాప్ ద్వారా కర్ణాటక రాష్ట్రం హుబ్లీ పరిసర ప్రాంతాల్లో పలువురి వద్ద నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు సేకరించారు. ఈ యాప్‌లో పెట్టుబడులు పెడితే, వాటిని అంతర్జాతీయ షేర్ మార్కెట్‌కు మళ్లించి, పెద్ద మొత్తంలో కమీషన్లు తిరిగి చెల్లిస్తామని బాధితులను నమ్మించారు. దీంతో పెద్ద మొత్తంలో నకిలీ యాప్ ద్వారా వారికి పెట్టుబడులు అందాయి. పెట్టుబడిదారుల నుంచి బ్యాంకు ఖాతా, ఏటీఎం, పిన్ తదితర వివరాలను ధ్రువపత్రాలతో పాటు సేకరించారు. కొంతమందికి కమీషన్ల రూపంలో నగదు తిరిగి యాప్ ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఇలా నమ్మకం కుదరడంతో మౌత్ పబ్లిసిటీ ద్వారా నకిలీ యాప్‌లో పెద్ద మొత్తంలో పలువురు పెట్టుబడులు పెట్టారు. అయితే యాప్‌లో పెట్టుబడులు పెట్టిన కర్ణాటక రాష్ట్రం హుబ్లీకి చెందిన ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి ఇటీవల, అతనికి తెలియకుండా రూ. 15 లక్షలు మాయమయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన బాధితుడు హుబ్లీ పోలీసులకు ఆన్‌లైన్ మోసంపై ఫిర్యాదు చేశాడు. కేసును విచారించిన హుబ్లీ పోలీసులు నకిలీ యాప్‌కు సంబంధించిన ముగ్గురు నిందితుల బ్యాంకు ఖాతాల్లో రూ. 70 - 80 లక్షలు జమ అయినట్లు నిర్ధారించారు. ఆయా ఖాతాల నుంచే నకిలీ యాప్ పెట్టుబడిదారులకు లావాదేవీలు నిర్వహించినట్లు గుర్తించారు. దీంతో నిందితులను పట్టుకునేందుకు హుబ్లీ పోలీసులు శుక్రవారం మదనపల్లెకు చేరుకున్నారు. స్థానికంగా ఓ గదిని అద్దెకు తీసుకుని నిందితుల కోసం గాలించారు. శనివారం టూ టౌన్ పోలీసుల సాయంతో నీరుగట్టువారిపల్లెలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. టూ టౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో కర్ణాటక రాష్ట్రం హుబ్లీకి తరలించారు. ఆన్‌లైన్ మోసానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నిక



అసోసియేషన్ సభ్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ తెలిపారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా బి. కృష్ణకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టి.శశిధర్, వైస్ ప్రెసిడెంట్‌గా బి.ఎల్లయ్య, సెక్రటరీగా సి.సురేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వినీలతతో పాటు పలువురిని అసోసియేషన్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ముదివేడులో తీరిన 30 ఏళ్ల సమస్య



ముదివేడులో కొత్తగా నిర్మించిన మురికినీటి కాలువ

కురబలకోట : మండలంలోని ముదివేడు కస్బాలో 30 ఏళ్లుగా వేధిస్తున్న మురికినీటి కాలువల సమస్య శాశ్వతంగా పరిష్కారమైంది. ముదివేడులో 30 ఏళ్లుగా మురికినీటి కాలువల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉండేది. పైగా ఈ ఊరికి ఎగువన ఏడు చెరువులు ఉన్నాయి. వర్షం పడితే ఆ ప్రభావం ఊరిపై పడేది. కాలువలో నీళ్లు ప్రవహించి నీళ్లు నిలిచిపోయేవి. రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ పరిస్థితిపై అధ్యయనం చేసిన సర్పంచ్ ఎం.షహనాజ్ బేగంతో పాటు ఆమె కుమారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.ఫిరోజ్‌ఖాన్, ఎం. అంజాద్‌ఖాన్ ప్రత్యేక చొరవ చూపారు. రూ. 5 లక్షల అంచనా వ్యయంతో ఊరిలో మురికినీటి కాలువలను కలుపుతూ కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. శనివారంతో పనులు పూర్తయినట్లు వారు తెలిపారు. దీంతో మురికినీటి కాలువల సమస్య శాశ్వతంగా తీరిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మిద్దె పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

నిమ్మనపల్లె : మిద్దె పై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. ముష్టూరు పంచాయతీ పట్వారిపల్లె (ఊళ్లోల ఇండ్లు) కు చెందిన కె.గంగాధర (37) ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మర్రి బండ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్ద పనులు చేస్తున్నాడు. సాయంత్రం స్నేహితులతో మిద్దె పైకి వెళ్లి నిర్మాణంలో ఉన్న గోడను ఆనుకొని స్నేహితులతో మాట్లాడుతూ ఉండగా, ఒక్కసారిగా కమ్మీలు ఊడిపోయి పడిపోవడంతో గంగాధర్ పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే నిమ్మనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- ఒకరిపై పీడీ చట్టం నమోదు



గంజాయి నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె : పట్టణంలోని న్యూబైపాస్‌రోడ్డు చంద్రా కాలనీ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2.50 లక్షల విలువచేసే 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. శనివారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశంలో గంజాయి నిందితుల అరెస్ట్‌కు సంబంధించి వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలతో సీసీఎస్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేశామన్నారు. పట్టణంలోని చంద్రా కాలనీలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి ఫిబ్రవరి 21 శుక్రవారం దాడి చేశామన్నారు. ఈ దాడుల్లో స్థానికంగా గంజాయి విక్రయిస్తున్న బీకే. పల్లె మంజునాథకాలనీకి చెందిన గంటా భాగ్యమ్మ అలియాస్ ఆవుల భాగ్య(31), జెండాగుట్ట లక్ష్మీనగర్‌కు చెందిన మేస్త్రీ ఆవుల అనిల్(27), అదే ప్రాంతానికి చెందిన ఆవుల శివమ్మ(24)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.2.50 లక్షలు విలువచేసే 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందులో మొదటి నిందితురాలు ఆవుల భాగ్యపై పలమనేరు, పుంగనూరు, పీటీఎం పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు గంజాయి కేసులు నమోదయ్యాయని, జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. పలుమార్లు గంజాయి కేసులు నమోదవుతుండటంతో భాగ్యపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేశామన్నారు. మదనపల్లె పట్టణంలో గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసుల ఫోన్ నంబర్లు.. 9491074519, 9440796741, 08571-222109, టోల్‌ఫ్రీనెంబర్.1972 కు తెలపాలన్నారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో సీఐలు రామచంద్ర, కళా వెంకటరమణ, ఎరీషావలీ, సత్యనారాయణ, ఎస్‌ఐలు రామకృష్ణారెడ్డి, రహీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఒకే భూమికి ఎన్ని రిజిస్ట్రేషన్‌లు చేస్తారు.?

- సబ్ రిజిస్ట్రార్‌ను నిలదీసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా
- టీడీపీ మాజీ ఎమ్మెల్యే రిజిస్ట్రేషన్‌ను బ్లాక్ చేయమని ఆదేశాలు



సబ్ రిజిస్టార్ గురుమూర్తిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పాతికేళ్ల క్రితం ప్లాట్ల రూపంలో కొనుగోలు చేసిన భూమిని, తిరిగి వ్యవసాయ భూమి కింద వేరొకరికి ఎలా రిజిస్ట్రేషన్ చేశారని, చేసేటప్పుడు కనీసం రికార్డులు కూడా పరిశీలించరా..? ఒక భూమికి ఎన్ని రిజిస్ట్రేషన్‌లైనా చేసేస్తారా? అంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ రిజిస్ట్రార్ గురుస్వామిని నిలదీశారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్.. తమ ఇంటి స్థలాలు కబ్జా చేశారని చేనేత కార్మికులు శనివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. పాతికేళ్ల క్రితం తాము కొనుగోలుచేసిన డాక్యుమెంట్లు, బ్యాంకు తాకట్టుపత్రాలు, నిర్మాణం జరిపిన ఇళ్ల ఫొటోలు ఆయనకు చూపించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, తాము ప్లాట్ల రూపంలో కొనుగోలు చేసిన భూమిని, వ్యవసాయభూమిగా పేర్కొంటూ జీపీ ద్వారా జనవరి 2025లో తనపేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ప్రస్తుతం ఆ డాక్యుమెంట్లు పట్టుకుని తమ స్థలాల్లోకి వచ్చి దౌర్జన్యానికి పాల్పడుతున్నాడన్నారు. తమ ఇళ్లచుట్టూ జేసీబీతో గుంతలు తవ్వి కంచె వేస్తూ, ఎవ్వరినీ లోనికి రానివ్వకుండా బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగని పక్షంలో యువ నాయకుడు నారా లోకేష్‌ను కలిసి, మాజీ ఎమ్మెల్యే అక్రమాలపై ఫిర్యాదు చేస్తామన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ.. సబ్ రిజిస్ట్రార్ గురుమూర్తితో.. బండమీద కమ్మపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్.423-1, 423-2లో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ పేరుతో జరిగిన రిజిస్ట్రేషన్లు బ్లాక్‌లో పెట్టాల్సిందిగా ఆదేశించారు. గతంలో ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్న వారు మున్సిపాలిటీ ప్లాన్ అప్రూవల్ ఉంటే ఇళ్ల నిర్మాణాలు చేసుకోండని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన వారిలో బాధితులు నళిని, మాలిని, మంజుల, వెంకటయ్య, ఆర్.శంకర్, చంద్రశేఖర్, రమణ, స్వాతి, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల తనిఖీ



పెట్రోల్ బంకులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప అర్బన్ : కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం విజిలెన్స్ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, పౌరసరఫరాల శాఖాధికారులతో కలిసి జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, అన్నమయ్య జిల్లా రాయచోటిలో పెట్రోల్ బంకులలో ఆకస్మిక తనిఖీ చేశారు.

- కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో తేజా ఫిల్లింగ్ సెంటర్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి లోపాలు కనిపించకపోవడంతో వెనుదిరిగారు. అలాగే కడప నగరం వినాయకనగర్‌లోని కె.ఎస్. చెట్టి అండ్ సన్స్, ప్రొద్దుటూరులో కూడా తనిఖీలు నిర్వహించారు. దీంతోపాటు అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఎస్.ఎన్ కాలనీలో శ్రీ సాయి బాలాజీ ఏజెన్సీ, శ్రీ సాయి రజిత ఫిల్లింగ్ స్టేషన్‌లలో తనిఖీలు చేశారు. పెట్రోల్ బంకుల యజమానులు నిమయ నిబంధనలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేయాలని విజిలెన్స్ అధికారులు సూచించారు. ఈ తనిఖీలలో కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జి. శ్రీనివాసరావు స్వయంగా పాల్గొని సూచనలు చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు ఎం. శివన్న, ఎన్. నారాయణప్ప, డీఈఈ ఏ.వీ. జవహర్‌రెడ్డి, ఏఈఈలు కె. విజయ్‌కిషోర్, వి.అశోక్‌కుమార్, డీసీటీఓ బి. గీతావాణి, ఎస్. ఖాజాహుసేన్, బి. బాబు మోజెస్, రమేష్‌రెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, ఏఎస్‌ఓ తారకనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం పోతేగానీ పట్టించుకోరా..!

- హైవే అధికారుల నిర్లక్ష్యానికి టెంపో డ్రైవర్ బలి
- ఆగమేఘాలపై రోడ్డు మరమ్మతు పనులు



అంగళ్లు హైవేపై ప్రమాదంలో విగతజీవిగా టెంపోపై వేలాడుతున్న మనోహర్

కురబలకోట : చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా హైవే అధికారుల పనితీరు కనిపిస్తోంది. వీరి నిర్లక్ష్యంతో ములకలచెరువు మండలం రాయపువారిపల్లెకు చెందిన టెంపో డ్రైవర్ మనోహర్ (24) అంగళ్లు హైవేపై లారీ ఢీకొన్న సంఘటనలో శుక్రవారం వేకువ జామున మృతి చెందిన విషయం తెలిసిందే. హైవేలో గోల్డన్ వ్యాలీ విద్యా సంస్థల వద్ద రోడ్డు పనులు జరుగుతున్నాయి. అయితే డైవర్షన్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుండా అలానే వదిలేశారు. దీంతో శుక్రవారం వేకువ జామున కదిరి మార్గం నుండి వచ్చిన సిమెంటు లారీ హైవేలో రాంగ్ సైడ్ వెళ్లి ఎదురుగా వచ్చిన టెంపోను ఢీకొంది. ఈ సంఘటనలో టెంపో డ్రైవర్ మనోహర్ మృతి చెందాడు. దీంతో హైవే అధికారులు శనివారం అంగళ్లు హైవే మొత్తాన్ని బ్లాక్ చేశారు. వాహనాల రాకపోకలను నిలిపివేశారు. గోల్డన్‌వ్యాలీ కళాశాల వద్ద పనులు ముమ్మరం చేశారు. డైవర్షన్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి తిరిగి హైవేపై రాకపోకలు పునరుద్ధరించారు. ఇదిలా ఉండగా మనోహర్ తండ్రి అంధుడు. తల్లి కూలి పనులతో జీవనం సాగిస్తోంది. కుటుంబానికి ఆదరువుగా ఉన్న మనోహర్ హైవే అధికారుల నిర్లక్ష్యానికి బలయ్యాడని కుటుంబీకులు, బంధుమిత్రులు ఆరోపిస్తున్నారు.

భూ వివాదంపై ఇరువర్గాల ఘర్షణ



తహసీల్దార్ కార్యాలయం వద్ద వాదులాడుకుంటున్న ఇరువర్గాలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని సియవరం పంచాయతీ పరిధిలో ఉన్న మొలకలపోడు దళితవాడలో సర్వే నంబర్ 74/1,2లో ఉన్న సుమారు 20 ఎకరాల భూ వివాదానికి సంబంధించి శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గతంలో తమకు రిజిస్ట్రేషన్ ఉందని కొందరు యంత్రాలు పెట్టి భూమిని చదును చేస్తుండగా స్థానికంగా ఉన్న గ్రామస్తులు అడ్డుకున్నారు. పరిస్థితి తీవ్రమై తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుంది. కార్యాలయం వద్దే ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరు వర్గాల నాయకులను పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి విచారిస్తున్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని సీఐ హేమసుందర్ రావు తెలిపారు.